క్లుప్తంగా

ఎంపీడీవో కార్యాలయంలో కుంగిన టైల్స్



వరండాలో ఊడిపోయిన టైల్స్

దహెగాం: ఎంపీడీవో కార్యాలయంలో సుమారు నాలుగు సంవత్సరాల క్రితం మరమ్మతులు చేపట్టారు. కార్యాలయం వరండాలో లక్షల రూపాయలు ఖర్చు పెట్టి టైల్స్ వేయించారు. నాణ్యత పాటించకపోవడంతో టైల్స్ పగిలిపోయాయని సిబ్బంది పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని మండలవాసులు కోరుతున్నారు.

సెల్‌ఫోన్లు అందజేత



సెల్‌ఫోన్లు అప్పగిస్తున్న ఎస్సై మధుకర్

కెరమెరి: సెల్‌ఫోన్లు పోగొట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధితులకు పోలీసులు వాటిని గుర్తించి శుక్రవారం అప్పగించారు. ఎస్సై ఎస్.మధుకర్ కథనం ప్రకారం మోడి గ్రామానికి చెందిన ఆత్రం భుజంగ్‌రావు, కరంజివాడ గ్రామానికి చెందిన బోడ్కె గోవింద్‌రావు, కెస్లాగూడకు చెందిన కుమురం చిత్రులు సెల్‌ఫోన్‌లను కెరమెరి మార్కెట్‌లో పోగొట్టుకున్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోయిన సెల్‌ఫోన్‌లను గుర్తించి శుక్రవారం బాధితులకు అందజేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన రాయితీ బియ్యం పట్టివేత



పట్టుకున్న రాయితీ బియ్యం

వాంకిడి: రేషన్‌కార్డుదారుల నుంచి కొనుగోలు చేసి అక్రమంగా నిల్వ ఉంచిన రాయితీ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు రాజ్‌కుమార్, శ్రీనివాస్ గురువారం రాత్రి పట్టుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఘాట్‌జనగాం గ్రామంలో కొందరు అక్రమార్కులు రేషన్ కార్డుదారుల నుంచి రాయితీ బియ్యం కొనుగోలు చేసి అదే గ్రామానికి చెందిన గుర్నులే హరిదాస్ అనే వ్యక్తి ఇంట్లో నిల్వ ఉంచారు. పక్కా సమాచారం మేరకు డీటీలు గురువారం రాత్రి పది గంటలకు గ్రామంలో తనిఖీలు నిర్వహించగా సుమారు 10 క్వింటాళ్ల బియ్యం పట్టుబడింది. నిందితులపై కేసు నమోదు చేస్తామని డీటీలు తెలిపారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న రాయితీ బియ్యం అమ్ముకున్న లబ్ధిదారుల రేషన్ కార్డులు తొలగిస్తామని హెచ్చరించారు.

పెద్దవాగులో ఒకరు గల్లంతు

దహెగాం: మండలంలోని బొర్లకుంట గ్రామానికి చెందిన జుమ్మిడి మధూకర్ (45) పెద్దవాగులో గల్లంతయ్యాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బొర్లకుంట గ్రామానికి చెందిన జాడి కొండుబాయి అనే వృద్ధురాలు గురువారం మృతి చెందింది. శుక్రవారం పిట్టకు పెట్టే కార్యక్రమంలో భాగంగా బంధువులంతా వాగు వద్దకు వెళ్లగా వారితో పాటే మధూకర్ కూడా వెళ్లాడు. కార్యక్రమం నిర్వహిస్తున్న క్రమంలో స్నానం చేయడానికి వాగులోకి దిగాడు. వాగులో లోతు ఎక్కువగా ఉండడంతో గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు వాగు వద్దకు వెళ్లి గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రమైనా మధూకర్ ఆచూకీ లభించలేదు.

'విద్యార్హత లేని టీచర్లతో విద్యాబోధన సరికాదు'

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్‌లోని సెయింట్ పాల్స్ పాఠశాలలో అర్హత లేని ఉపాధ్యాయులతో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారని విద్యార్థులు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. శుక్రవారం పాఠశాల యజమాన్యానికి వినతిపత్రం అందించారు. అధ్యాపకులకే అర్హత లేకపోతే విద్యా ప్రమాణాలు దెబ్బతింటాయన్నారు. పాఠశాలలో పని చేస్తున్న ప్రతీ టీచర్ అర్హతలను పరిశీలించి, ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. అర్హతలు లేని ఉపాధ్యాయులు ఉంటే, వారిని వెంటనే తొలగించి, అర్హత కలిగిన టీచర్లను నియమించాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు ధరణి రాజేశ్, దూట మహేందర్, గవస్కర్ లక్ష్మి, మాస్ సార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సాంకేతిక విద్య

- జిల్లాలో 122 పాఠశాలలు ఎంపిక
- ప్రస్తుతం 14 స్కూళ్లలో ఏఐ విద్యాబోధన అమలు
- నిత్యం అదనపు కలెక్టర్ పర్యవేక్షణ



చిర్రకుంట పాఠశాలలో ఏఐ పాఠశాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్‌రూరల్: ఆధునిక బోధనా విధానాల ద్వారా విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ బోధనకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో మొత్తం 122 పాఠశాలలను ఎంపిక చేయగా ప్రస్తుతం 14 ప్రాథమికోన్నత పాఠశాలల్లో కంప్యూటర్ సాంకేతిక విద్య (ఏఐ) బోధన అందిస్తున్నారు. త్వరలోనే మిగతా 108 పాఠశాలల్లో ఏఐ బోధనకు శ్రీకారం చుట్టనున్నారు. విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను పెంచేందుకు డిజిటల్ ఏఐ బోధన ఆవశ్యకతను విద్యాశాఖ గుర్తించింది. ఎంపిక చేసిన పాఠశాలలకు కంప్యూటర్లు, అంతర్జాల సదుపాయం అందించేందుకు చర్యలు చేపడుతోంది.

వెనుకబడిన విద్యార్థులను గుర్తించి..

ప్రాథమిక పాఠశాలల్లో 3, 4, 5 తరగతుల విద్యార్థుల్లో గణితం, భాష విషయాల్లో కనీస సామర్థ్యాలు కొరవడిన వారిని గుర్తిస్తారు. వారికి కంప్యూటర్లను ఆన్‌చేసి తమ సైట్‌లోకి ఎలా వెళ్లాలనే కనీస పరిజ్ఞానం కల్పించే శిక్షణనిస్తారు. కనీసం 10 మంది ఒకేసారి కంప్యూటర్ ద్వారా ఏఐ బోధన ఉపయోగించుకునేలా ప్రోత్సహిస్తారు. ఏక్‌స్టెప్ ఫౌండేషన్ వారు రూపొందించిన ప్రత్యేక ఏఐ సైట్ ద్వారా విద్యార్థి తమ పెన్ (పర్మినెంట్ ఎడ్యుకేషన్ నెంబర్)ను నమోదు చేయడం ద్వారా లాగిన్ అవ్వాల్సి ఉంటుంది. ఈ యాప్‌లో విద్యార్థి సామర్థ్యాలను పరీక్షించేందుకు ఏఐ కృత్యాలు ఇస్తున్నారు. ఒక్కొక్క విద్యార్థికి 20 నుంచి 25 నిమిషాల పాటు కంప్యూటర్‌ను ఉపయోగించేలా ఉపాధ్యాయులు కాలాంశాలను నిర్ణయిస్తారు. సోమ, మంగళవారాల్లో తెలుగు, బుధ, గురువారాల్లో గణిత విషయాలపై కృత్రిమ మేధ ద్వారా పాఠాలు నేర్పిస్తున్నారు.

నిత్యం పర్యవేక్షణ..

అదనపు కలెక్టర్ డీఈవోగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ప్రతీరోజు జిల్లాలో ఒకటి, రెండు స్కూళ్లను పర్యవేక్షిస్తున్నారు. దానికి తోడు ఎఫ్ఆర్ఎస్ అమలు కావడంతో ఉపాధ్యాయులు పాఠశాలలకు డుమ్మా కొట్టడం లేదు. ఉపాధ్యాయులు తమ విధులను సక్రమంగా నిర్వహిస్తున్నారు. అదనపు కలెక్టర్ దీపక్ తివారీ తరచూ పర్యవేక్షణతో హాజరు శాతం గణనీయంగా పెరిగినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. దానితో పాటు పదో తరగతి ఫలితాల్లో మెరుగున ఫలితాలు సాధించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

మెరుగైన స్థానమే లక్ష్యం

జిల్లాలో విద్యార్థుల హాజరు పెంచి, ఉపాధ్యాయుల పనితీరు మెరుగుపర్చడం ద్వారా ఉత్తమ అభ్యసన ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకుంటున్నాం. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నాం.

– దీపక్ తివారి, (డీఈవో)అదనపు కలెక్టర్

కల్వర్టుకు మరమ్మతులు చేయరూ..!



పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ మండలంలోని అగర్‌గూడ గ్రామ ప్రధాన రహదారిపైన ఉన్న కల్వర్టు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతింది. వరద నీటితో కల్వర్టుకు ఇరువైపుల ఉన్న అప్రోచ్ మట్టి కొట్టుకుపోయి పైపులు బయటపడ్డాయి. రోడ్డు తెగిపోక ముందే అధికారులు కల్వర్టుకు మరమ్మతులు జరిపించాలని మండలవాసులు కోరుతున్నారు.

ఘనంగా కామ్రేడ్ నాగటి నారాయణ వర్ధంతి

కాగజ్‌నగర్‌టౌన్: నిరంతర ఉపాధ్యాయుడు, ఉద్యమకారుడు కామ్రేడ్ నాగటి నారాయణ 3వ వర్ధంతిని పట్టణంలోని ఆదర్శనగర్‌లో గల యూటీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతికుమారి మాట్లాడుతూ కామ్రేడ్ నారాయణ నిరంతర ఉపాధ్యాయుడని, ఉద్యమకారుడని, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, జాతీయ స్థాయిలో ఎస్‌టీఎఫ్ ఉపాధ్యక్షుడిగా ఉపాధ్యాయ ఉద్యమానికి 3 దశాబ్దాల పాటు విశిష్ట సేవలందించారని, ఆయన ఆశయాలను కొనసాగించాలన్నారు. అంతకుముందు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ నాయకులు ప్రీతి, రాజ్‌కమలాకర్, మహేశ్, హరీశ్, సురేశ్, సమతకుమారి, తదితరులు పాల్గొన్నారు.



చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

యాక్టింగ్ కార్మికులకు ప్రమోషన్లు కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న హెచ్ఎంఎస్ నాయకులు

రెబ్బెన: ఖైరిగూర ఓసీపీలో వివిధ డిజిగ్నేషన్‌లలో యాక్టింగ్ చేస్తున్న కార్మికులకు ప్రమోషన్లు కల్పించాలని హెచ్ఎంఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు అన్నారు. శుక్రవారం ఖైరిగూడ ఓసీపీ ప్రాజెక్టు అధికారి నరేందర్‌ను కలిసి కార్మిక సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓసీపీ కార్మికులకు విధులకు హాజరయ్యేందుకు పావురాల గుట్ట వద్ద రోడ్డు సురక్షితంగా లేదని వెంటనే యాజమాన్యం కార్మికుల కోసం సురక్షిత రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. కార్మికులకు పెర్క్స్‌పై ఐటీని మాఫీ చేయాలని, గోలేటి ఓసీపీ ఏర్పాటుకు సంబంధించిన అనుమతులు త్వరగా వచ్చేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సింగరేణి మెడికల్ బోర్డును ఏర్పాటు చేయాలని, ఏ గ్రేడ్ వాహనాలను నడుపుతున్న ఈపీ ఆపరేటర్లకు ఏ గ్రేడ్ ప్రమోషన్లు కల్పించాలన్నారు. కార్యక్రమంలో బ్రాంచి కార్యదర్శి శివారెడ్డి, ఖైరిగూర ఇన్‌చార్జి వెంకటేశ్, అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శి కుమార్‌గౌడ్, ఏరియా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్‌కే ఇనూస్, నాయకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న మెస్రం రూప్‌దేవ్

నార్నూర్: మండల కేంద్రంలోని కుమురం భీం భవన్ వద్ద ఈనెల 12న ఆదివారం దసరా ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆదివాసీ జేఏసీ చైర్మన్ మెస్రం రూప్‌దేవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కుమురం భీం భవన్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆదివాసీ గిరిజన సంస్కృతి, సాంప్రదాయం ప్రకారం 12న ఉదయం 9:30 గంటలకు దసరా ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గ్రామపటేళ్లు, కటోడాలు, దేవారిలు, గిరిజనులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావు, ఐటీడీఏ పాలక మండలి మాజీ డైరెక్టర్ మాడవి మాన్కు, ఉర్వేత రూప్‌దేవ్ పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్‌తో ఆటలాడొద్దు



మాట్లాడుతున్న నాయకులు

నార్నూర్: విద్యార్థుల భవిష్యత్‌తో ఆటలాడొద్దని, బెస్ట్ అవైలబుల్ స్కీం స్కాలర్‌షిప్ పెండింగ్ నిధులు విడుదల చేయాలని రాజ్‌గోండ్ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు కుంర చతుర్‌షావ్, జైభారత్ జిల్లా అధ్యక్షుడు పెందూర్ దీపక్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని కుమురంభీం చౌక్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థులు బెస్ట్ అవైలబుల్ పాఠశాలలకు ఎంపికయ్యారని, ప్రభుత్వం పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేసి వారి భవిష్యత్‌ను కాపాడాలన్నారు. దసరా సెలవు తర్వాత వారు ఇంటి వద్దే ఉన్నారని ఇప్పటికైనా ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా స్పందించి పిల్లలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ ప్రధాన కార్యదర్శి ఆర్కా గోవింద్, ఆత్రం జాలిమ్‌షావ్, రిషికుమార్, తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్య పంటలపై దృష్టి సారించాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

సాత్నాల: వాణిజ్య పంటలపై దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి అశ్రఫ్ అన్నారు. భోరజ్ మండలం పెండల్వాడ గ్రామంలో శుక్రవారం రైతువేదికలో నిర్వహించిన కార్యక్రమంలో రైతులను ఉద్దేశించి మాట్లాడారు. హార్టికల్చర్ ఆధ్వర్యంలో 90 శాతం సబ్సిడీతో, ఆయిల్‌పాం సాగుకు చేయూత ఇవ్వడం జరుగుతుందన్నారు. సాంప్రదాయ పంటలను సాగు చేస్తూనే వాణిజ్య పంటల వైపు మొగ్గు చూపాలన్నారు. ముంపు ప్రాంత రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో తాసిఫ్, హెచ్ఈవో సతీష్, రీజనల్ మేనేజర్ రోహిత్, నవీన్, రోహిత్ పాల్గొన్నారు.



ప్రారంభం ఎప్పుడో..!

కెరమెరి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం సమీపంలో ఇందిరమ్మ మోడల్ గృహం నిర్మాణం పూర్తయ్యి నెల రోజులు గడుస్తున్నప్పటికీ నేటికీ ప్రారంభానికి ముహూర్తం ఖరారు కాలేదు. రూ. 5 లక్షలతో నిర్మించే ఇందిరమ్మ గృహం ఎలా ఉంటుందో లబ్ధిదారులకు తెలియజేసేందుకు నిర్మించిన మోడల్ గృహం ఇది.

సమస్యల్లో 'లింగాపూర్'

- కానరాని మౌలిక సదుపాయాలు
- గ్రామాలకు రహదారులు కరువు
- అభివృద్ధి చేయాలని మండలవాసుల డిమాండ్



లింగాపూర్ మండల కేంద్రం

లింగాపూర్: అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్న ఏజెన్సీ మండలాన్ని అభివృద్ధి చేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు విన్పిస్తున్నాయి. లింగాపూర్ మండలంగా ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ కనీస సౌకర్యాలు లేక మండలవాసులు తిప్పలు పడుతున్నారు. మండలంలో ఎక్కువగా గిరిజన, ఆదివాసీ కుటుంబాల వారు నివసిస్తున్నారు. మండలంలో 14 గ్రామపంచాయతీలు ఉండగా, వాటిలో దాదాపు 25వేలకు పైగా జనాభా ఉంది.

బీటీ రోడ్లు లేక తిప్పలు..

మండల కేంద్రం నుంచి అనేక గ్రామాలకు బీటీ రోడ్డు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వానాకాలం వచ్చిందంటే రామునాయక్ తండా -ఎల్లాపటార్, పిక్లాతండా గ్రామం -కొత్తపల్లి, గుమ్నూర్ -పట్కల్‌మంగి, చోర్‌పల్లి -కుట్టాభద్ర, రింగరేట్, జాముల్‌ధర -పంగిడిమాధర గ్రామాల ప్రజలకు కాలినడకే శరణ్యమవుతుంది. చాలా గ్రామాలకు మార్గ మధ్యలో ఉండే వాగులపై ఉన్న లో లెవల్ వంతెనలపై నుంచి వరద ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. మండల కేంద్రంలో ఉన్న సప్త (మిట్టె) జలపాతాన్ని చూసేందుకు ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, జగిత్యాల, హైదరాబాద్, నిజామాబాద్‌తో పాటు మహారాష్ట్ర నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. కానీ 3 కిలోమీటర్ల దూరం ఉన్న జలపాతం వద్దకు వెళ్లేందుకు బీటీ రోడ్డు సౌకర్యం లేక బురదలో కాలినడకన వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

సులభ్ కాంప్లెక్స్‌లు కరువు..

మండలంలో వివిధ గ్రామాలకు చెందిన వారు వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వస్తుంటారు. మండల కేంద్రంలో సులభ్ కాంప్లెక్స్‌లు లేక ప్రజలు, ప్రయాణికులు పడరాని పాట్లు పడుతున్నారు. అత్యవసర సమయంలో వేరే మార్గం లేక గ్రామానికి దూరంగా కనీసం కిలోమీటర్ వెళ్లి చెట్లు, వాగులు, వంకలు, రోడ్ల పక్కన పని కానిస్తున్నారు. కాగా మండలకేంద్రంలో ప్రతీవారం నిర్వహించే వారసంతకు వచ్చే వారు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. వారసంతకు వచ్చే మహిళలు మరుగుదొడ్లు, మూత్రశాలలు లేకపోవడంతో పడుతున్న బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి.

కానరాని నిఘా నేత్రాలు..

మండల కేంద్రంతో పాటు సమస్యాత్మక గ్రామాల్లో గత ప్రభుత్వ హయాంలో పంచాయతీ అధికారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అయితే వాటి నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో రెండేళ్లుగా సీసీ కెమెరాలు పని చేయడం లేదు. కాగా మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు కరువయ్యాయి. తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలకు సొంత భవనాలు లేక, కార్యాలయాలకు వచ్చే వారికి మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు.

సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలి..



మండల కేంద్రంలో సులభ్ కాంప్లెక్స్ లేక తిప్పలు పడుతున్నాం. వారసంత రోజు సమస్య మరింత తీవ్రమవుతుంది. అధికారులు స్పందించి సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలి. – సేడ్మకి గణేశ్, లింగాపూర్

పర్యాటకంగా అభివృద్ధి చేయాలి



పర్యాటకులను ఆకట్టుకునే ఎన్నో ప్రకృతి అందాలకు నిలయమైన లింగాపూర్ మండలాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలి. తద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయి. మండల కేంద్రం నుంచి అన్ని గ్రామాలకు రోడ్డు సౌకర్యాలు కల్పించాలి.

– బానోత్ అంబాజీ, పిక్లాతండా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలో శనివారం ఉదయం 10 గంటల నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని సబ్‌స్టేషన్‌లో మెయింటనెన్స్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

'ఎమ్మెల్యే రాజాసింగ్‌పై చర్యలు తీసుకోవాలి'

ఆసిఫాబాద్: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో మహమ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే రాజాసింగ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ జమీయత్ ఉలామత్ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ డేవిడ్‌కు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. రాజాసింగ్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు అహ్మద్ మోబిన్, అలీమ్ హుస్సేనీ, అహ్మద్ అమీన్, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి



మాట్లాడుతున్న ఐటీడీఏ జీసీడీవో ఛాయాదేవి

తలమడుగు: ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఐటీడీఏ జీసీడీవో మెస్రం ఛాయాదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని ఉమ్రీ ఆశ్రమ బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో సమావేశమై ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలు, వంటగది శుభ్రంగా ఉంచాలని, వంట సామగ్రి, కూరగాయలు శుభ్రంగా కడిగి వంట చేయాలన్నారు. అనంతరం విద్యార్థుల ఆరోగ్య రికార్డులను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయురాలు అరుణ, వార్డెన్ హిరమన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుడిహత్నూర్: గిరిజన సంక్షేమశాఖ ద్వారా విద్యార్థులకు అందిస్తున్న సేవలు నాణ్యమైనవిగా ఉండాలని ఏటీడీవో నిహారిక అన్నారు. శుక్రవారం మండలంలోని ఉమ్రి (బి) గిరిజన బాలికల ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. నాణ్యమైన భోజనంతో పాటు మెరుగైన విద్యనందించాలన్నారు. పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉంచాలన్నారు. పాఠశాల హెచ్ఎం భోజన్న, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మూగ శ్రీనివాస్, పీఎస్ హెచ్ఎం రాజేశ్వర్, మోహన్, వసంత్‌రావ్, వార్డెన్ రాంచంద్రుస్ పాల్గొన్నారు.

పరిహారం అందజేత

సిరికొండ: మండలంలోని రిమ్మ గ్రామానికి చెందిన మడావి సీతారాం, పెందుర్ జంగు, పెందుర్ శంభు రైతుల ఎద్దులు గత ఏడాది క్రితం విద్యుత్ షాక్‌తో మృత్యువాత పడ్డాయి. శుక్రవారం ఒక్కో రైతు రూ. 40 వేల చొప్పున పరిహారాన్ని ఆదిలాబాద్ విద్యుత్‌శాఖ కార్యాలయంలో అందుకున్నారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు, రిమ్మ మాజీ సర్పంచ్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి



నల్లాలను పరిశీలిస్తున్న ఎంఈవో అనిత

నార్నూర్: ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎంఈవో పవార్ అనిత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్‌లను పరిశీలించారు. మధ్యాహ్న భోజనంపై ఆరా తీశారు. నూతనంగా ఏర్పాటు చేసిన తాగునీటి నల్లాలను పరిశీలించి పని చేసేలా చూడాలని ప్రధానోపాధ్యాయుడిని ఆదేశించారు. ఉపాధ్యాయులు విద్యాబోధనలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.